## మార్పు కోసం సిపిఐ కృషి ప్రశంసనీయం



-అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పథకాలు
-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2 లో

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 21 | మే | 2024
పేజీలు 7

# ఉచితాలు సరే.. బస్సులేవి..?



-బస్సుల సంఖ్య పెరగక ప్రయాణికులు, సిబ్బంది సతమతం
-సిబ్బందికి పెరిగిన పని భారం
-కిక్కిరిసిన ప్రయాణికులతో కదలలేని బస్సులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో తొలిసారిగా డిసెంబరు తొమ్మిది నుంచి ఆర్టిసి బస్సులలో

మిగతా 2లో..

# ప్రశ్నించే గొంతుకను గెలిపించండి



-బ్లాక్ మెయిలర్లను ఓడించండి
-పట్టభద్రులకు కేటిఆర్ పిలుపు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** శాసన సభలో ఏకపక్ష ధోరణి వస్తే ప్రజాస్వామ్యాన్ని సమతుల్యం చేసేందుకు శాసన మండలిని ఏర్పాటు చేశారని తెలంగాణ శాసన మండలిలో ప్రశ్నించే గొంతుక అవసరమని బిఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కేటి రామారావు తెలిపారు. పట్టభద్రులు పార్టీలకు అతీతంగా నిబద్ధత కలిగిన ప్రజల పక్షాన మాట్లాడే వ్యక్తులను గెలిపించాలన్నారు. ఖమ్మం ఎస్‌బిఐటి కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల తరుపున పోరాడే రైతు కుటుంబానికి చెందిన ఏనుల రాకేష్‌రెడ్డిని బిఆర్ఎస్ బరిలోకి దించిందని కాంగ్రెస్ నుంచి బ్లాక్ మెయిల్ రాజకీయాలు, బూతు పురాణం మాట్లాడే వ్యక్తి రంగంలో ఉన్నారని పట్టభద్రులు ఆలోచించి ఓటేయాలని ఆయన కోరారు. రాకేష్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యను అభ్యసించి అమెరికాలో పెద్ద కంపెనీలలో ఉద్యోగం చేస్తూ సమాజ సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాడని ఆయన తెలిపారు. ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగే రీతిలోచండాలపు పని చేసిన వ్యక్తిని కాంగ్రెస్ తన

మిగతా 2లో..

## ఆదరించండి.. అండగా ఉంటా..

ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే అండగా ఉంటానని కాంగ్రెస్ ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి అభ్యర్థి

మిగతా 2లో..

## రేవంత్‌కు ఓటు అడిగే హక్కు లేదు..



-నిరుద్యోగుల, ఉద్యోగుల ఆశలను అడిఆశలు చేసిన కాంగ్రెస్
-మేధావి వర్గం ఆలోచించి ఓటు వేయాలి
-బిజెపి నేత ఈటల రాజేందర్

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పట్టభద్రులను ఓటు అడిగే హక్కు లేదని ఆశ చూపి ఉద్యోగుల, నిరుద్యోగుల ఆశలను ఆడిఆశలు చేశారని బిజెపి నాయకులు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. కాంగ్రెస్ వైఖరి చూస్తుంటే అరచేతిలో బెల్లం పెట్టి మోచేతిని నాకిస్తున్నారని ఆయన తెలిపారు. పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఆర్టిసి ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ తేదీ ఇవ్వలేదని, వేతనాలు ఒక్కొక్కరికి ఒక్కో రీతిలో వేస్తున్నారని దీనిని తక్షణం సరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి నాలుగు వేలు ఇవ్వకుండా ఏ ముఖం పెట్టుకుని నిరుద్యోగులను ఓట్లు అడుగుతారని రాజేందర్ ప్రశ్నించారు. నిరుద్యోగులకు నాలుగు డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పిఆర్‌సి ఊసే లేదని పిఆర్‌సి బకాయిలు చెల్లించకుండా ఓట్లు ఎలా అడుగుతారని ఆయన అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య కార్డు ఎక్కడ పని చేయడం లేదని ఆసుపత్రికి బకాయిలు చెల్లించక పోవడం వల్ల సౌకర్యాలు పొందలేక పోతున్నారని ఆయన తెలిపారు. కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలను బెదిరించి ఓటు వేయించాలని మంత్రులు చెబుతున్నారని ఈ సందర్భంగా విద్యా సంస్థల యాజమాన్యాలు సైతం ఆలోచన చేయాలని, రూ. 7,500 కోట్ల బకాయిలు విడుదల చేయలేదని ఆర్థిక ఇబ్బందుల్లో సంస్థలు నడుపుతున్న యాజమాన్యం ప్రభుత్వానికి వ్యతిరేకంగా

మిగతా 2లో..

# ఉచితాలు సరే.. బస్సులేవి..?



(మొదటిపేజీ తరువాయి)

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. పల్లె వెలుగుతో పాటు ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోను తెలంగాణ రాష్ట్ర మంతటా ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం మహిళలకు కల్పించారు. ఉచిత బస్సు ద్వారా ప్రయాణించడం వరకు బాగానే ఉంది కాని ఉచిత బస్సు సౌకర్యం తర్వాత బస్సుల సంఖ్యను పెంచకపోవడం, అటు ప్రయాణికులకు ఇటు సిబ్బందికి ఇబ్బందికరంగా మారింది. బస్సుల సంఖ్య సరిపడ లేకపోవడంతో బస్టాండ్ కిక్కిరిసిపోతున్నాయి. 55 మంది ప్రయాణించాల్సిన బస్సులో 110 నుంచి 120 మంది ప్రయాణిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. సోమవారం ఖమ్మం బస్టాండ్‌లో 80 మందితో బయలు దేరిన భద్రాచలం డిపో బస్సు ఖమ్మం నగరం దాటే సరికి 115 మంది ప్రయాణికులకు చేరుకుంది. భద్రాచలం వెళ్లెంత వరకు దిగి ఎక్కే సమయాల్లో ఒకరిద్దరు పెరిగారు తప్ప తగ్గలేదంటే అతిశయోక్తి కాదు. రెండు వరుసల్లో వెనక సీటు నుంచి దిగే మెట్ల వరకు కిక్కిరిసిపోతున్నారు. ఇక బస్టాండ్లు కొన్ని సందర్భాలలో జాతరను తలపిస్తున్నాయి. ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన ప్రభుత్వం ఆ రీతిలో బస్సుల సంఖ్యను పెంచక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి రెండు మూడు గంటలు వేచి చూసినా బస్సు ఎక్కే పరిస్థితి లేదు. బస్సులో కాలు మోపడానికి కూడా సందు ఉండడం లేదు. దీనితో వేలాడుతూ చేసే ప్రయాణం ప్రాణాల మీదకు తీసుకు వస్తుంది. మెట్ల మీద ప్రయాణిస్తూ ఓ మహిళ జారి కింద పడి ప్రాణాలను కోల్పోయింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రయాణికుల ఇబ్బందులు ఈవిధంగా ఉంటే సిబ్బంది తిప్పలు వర్ణణాతీతం. 100 మందికి పైబడిన బస్సులో టికెట్లు ఇచ్చేందుకు కండక్టర్లకు ముందుకు కదిలే అవకాశమే లేదు. ప్రయాణికులు పూర్తి స్థాయిలో సహకరించకపోవడంతో కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే సిబ్బంది కొరత కారణంగా పని గంటల కాలం పెరగడం దానికి తోడు కిక్కిరిసిన ప్రయాణికులతో సతమతమవుతున్నారు. డ్రైవర్ల ఇబ్బందులు మరో రకంగా ఉన్నాయి. డోరులో కూడా నిలబడి ప్రయాణిస్తున్న కారణంగా ఎడమ వైపు రోడ్డు కనిపించడం లేదని ప్రమాదం జరిగితే కేసులు నమోదు అవుతున్నాయని వాపోతున్నారు. దీనికి తోడు కిక్కిరిసిన బస్సులు స్టేజీలలో ఎలా ఆపుతారంటూ బస్సులో ఉన్న వారు తమతో ఘర్షణ పడుతున్నారని ఆపకపోతే రోడ్డుపై అడ్డంగా నిలబడి అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడులకు తెగబడుతున్నారని పల్లె వెలుగు నడిపే ఓ డ్రైవర్ వాపోయాడు. ఈ విషయంలో మిగిలిన డ్రైవర్ల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. ప్రభుత్వం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తక్షణం బస్సుల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఉచిత హామీతో సిబ్బంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది నియమాకం జరపాల్సి ఉంది. కండక్టర్లు, డ్రైవర్లతో పాటు మెకానికల్ ఇతర సిబ్బందిని నియమించాల్సి ఉంది. మండుటెండల్లో ప్రయాణికులను చేరవేస్తున్న సిబ్బందికి తగిన విధంగా ప్రోత్సహకాలు అందించాలని కోరుతున్నారు. దాంతో పాటు ప్రభుత్వం ఆర్టిసిని విలీనం చేస్తున్నట్లు ప్రకటించిన ఇంత వరకు అపాయింట్‌మెంట్ తేదీని ప్రకటించ లేదని వెంటనే ప్రకటించాలని బిఆర్ఎస్ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న డిఏలు ఇతరత్రా బకాయి పడిన ఆర్థిక అంశాలను తక్షణం పరిష్కరించాలని కోరుతున్నారు.

# ప్రశ్నించే గొంతుకను గెలిపించండి



(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థిగా నిలబెట్టిందని పలు కేసులు ఉండి పలుమార్లు జైలుకు వెళ్లిన వ్యక్తిని శాసన మండలికి పంపితే ఏమి జరుగుతుందో పట్టభద్రులు ఊహించాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇస్తానన్న నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాల గురించి పట్టించుకోవడం లేదని రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే వాటి కోసం పోరాడతారన్నారు. ఖమ్మం నగరం పదేళ్లలో సుందరంగా మారిందని అభివృద్ధిని కూడా పట్టభద్రులు గమనించాలన్నారు. రేవంత్‌రెడ్డి ఒక నోటిఫికేషన్ అయినా ఇచ్చారా అని కేటిఆర్ ప్రశ్నించారు. వరంగల్, ఖమ్మంకు బిఆర్ఎస్ సాఫ్ట్‌వేర్ కంపెనీలను తీసుకు వచ్చిందని రేవంత్‌రెడ్డి వచ్చాకా మహేంద్ర లాంటి కంపెనీలు వెనక్కి తిరుగుతున్నాయన్నారు. తెలంగాణలో ఐటి విలువ 2014లో రూ. 55వేల కోట్లు ఉంటే 2023 నాటికి రూ.రెండు లక్షల కోట్లకు పెంచామని కేటిఆర్ తెలిపారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొని రాకేష్‌రెడ్డికి ఓటేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదని రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇంత వరకు ఆ ప్రయత్నమే చేయలేదన్నారు. ఐదు నెలల కాలంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న ఏనాడైనా ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించారా ప్రజల పక్షాన నిలబడ్డారా అని పట్టభద్రులు తెలుసుకోవాలన్నారు. సేవా భావంతో రాజకీయాల్లోకి వచ్చానని నాలాంటి వ్యక్తులను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత మంది రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంపి నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, శాసన సభ్యులు పల్లా రాజేశ్వర రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మదన్‌లాల్, ఆర్‌జెసి కృష్ణ, కూరాకుల నాగభూషయ్య తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఇల్లందు, కొత్తగూడెంలో జరిగిన పట్టభద్రుల సమావేశాల్లో కేటిఆర్ బిఆర్ఎస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.

# పశువులు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అకాలవర్షాల కారణంగా పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువుల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పాల్వంచ సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్వంచ మండలం పరిధిలోని రేగులగూడెం పంచాయితీలో గల రాళ్లచెలక గ్రామంలో మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో పాటు పిడుగులు పడ్డాయని, దీంతో గ్రామానికి చెందిన నిరుపేద రైతులు పద్దం లక్క, మడకం జోగా, మడివి లక్క అనే రైతుల పశువులు మృత్యువాతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆ రైతులను ఆదుకోవాలని కోరారు.



# రేవంత్‌కు ఓటు అడిగే హక్కు లేదు..

(మొదటిపేజీ తరువాయి)

ఓటు వేయాలన్నారు. ఆరు నెలలుగా డయాగ్నస్టిక్ సెంటర్లలో పని చేస్తున్న వారికి వేతనాలు రావడం లేదని చిన్న ఉద్యోగులకు ప్రతి నెల వేతనాలు చెల్లించాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనతికాలంలోనే ప్రజల చిత్కరణకు గురవుతున్నారని రాష్ట్రంలో మహిళలకు నెలకు రూ. 2,500 ఇవ్వలేని ప్రభుత్వం రూ.8,500లను దేశ మంతటా ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. మోసపు మాటలు చెప్పడంలో కాంగ్రెస్ నేతలు సిద్ధహస్తులని ఇటువంటి సమయంలో మేధావి వర్గం ఆలోచించి బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించి శాసన మండలికి పంపించాలని ఆయన కోరారు. మీడియా సమావేశంలో బిజెపి నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, వినోదరావు, గెంటెల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మార్పు కోసం సిపిఐ కృషి ప్రశంసనీయం

**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** పేదోడి ప్రభుత్వం కావాలని మార్పు కోసం సిపిఐ పార్టీ ఎన్నికతో చేసిన కృషి ప్రశంసనీయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని గువ్వలగూడెం, ముజ్జుగూడెం, నాచేపల్లి, సదాశివాపురం, పాత కొత్తూరు, నాచేపల్లి తదితర గ్రామాల్లో సోమవారం ప్రజల వద్దకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తూరులో సిపిఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికతో సిపిఐ పొత్తులో భాగంగా తన గెలుపులో కీలక పాత్ర పోషించారన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. బిఆర్ఎస్ కక్షపూరితంగా పనులు కూడా ఆపేశారన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అర్హత ఉన్న వారికి ఇంటి స్థలం, ఇంటిని మంజూరు చేస్తామన్నారు. వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డికి ఆయా గ్రామాల్లో ఘన స్వాగతం పలికారు.

**కాళ్లమీద పడ్డ గిరిజనులపై కనికం చూపలేదు : భానుప్రసాద్**

మండలంలోని తిరుమలాపురంలో గిరిజన భూమిని ఆక్రమించారని గిరిజనులు గత పాలకుల కాళ్లపై పడ్డ కనికరం చూపలేదని సిపిఐ మండల కార్యదర్శి భానుప్రసాద్ తెలిపారు. గిరిజనులకు చెందిన 55 ఎకరాల భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారని వారికి న్యాయం చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, మరిశెట్టి వెంకటేశ్వరరావు, పోలంపల్లినారాయణ, మాలోత్ అయోధ్య, మల్లికార్జునరావు, నాగరాజు, అంజని, నరేష్, విజయ్‌బాబు, నవీన్, జగన్, కొండలు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదరించండి అండగా ఉంటా..

(మొదటిపేజీ తరువాయి)

తీన్మార్ మల్లన్న, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్‌కుమార్, డాక్టర్ కత్తి వెంకటస్వామి తదితరులు మాట్లాడుతూ పట్టభద్రులు ఎంతో విజ్ఞత గల వారని వారికి ఎవరు ప్రతినిధిగా ఉంటే న్యాయం జరుగుతుందో వారికి తెలుసన్నారు. కాంగ్రెస్‌తోనే నిరుద్యోగుల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఏ అధికారం లేనప్పుడే ప్రజా సమస్యలపై పోరాడిన నిఖర్సాయిన మనిషి మల్లన్న అని అధికారం ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైన వెళ్లి పరిష్కరిస్తాడని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా యువతకు అన్ని హామీల అమలుకు కృషి చేస్తానని తెలిపారు. పట్టభద్రులంతా తమ అమూల్యమైన ఓటును రెండవ నెంబరు వద్ద మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, వర్కింగ్ ప్రెసిండెంట్ నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, రాయల నాగేశ్వరరావు, వడ్డెబోయిన నర్సింహారావు, నాగా సీతారాములు, శ్రీనివాస్ యాదవ్, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, మదూరి ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుక



**ప్రజాపక్షం/భద్రాచలం :** జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదిన వేడుక పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అజీం అభిమానుల నడుమ కేక్ కట్ చేశారు. అనంతరం రాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అజీం మాట్లాడుతూ నటలో తాతకు తగ్గ మనుమనిగా పేరు గడించారని చెప్పారు. మరిన్ని వైవిధ్య భరితమైన పాత్రలు పోషించి నందమూరి పేరుకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని, త్వరలో రాబోయే సినిమా దేవర ఘనం విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చందు, కోటి, రమేష్, శ్రీను, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

# విసిపై సిబిఐ విచారణ చేపట్టాలి




**-విజిలెన్స్ దాడుల రిపోర్టును బహిర్గతం చేయాలి**
**-ఏఐఎస్ఎఫ్ డిమాండ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉద్యోగుల అక్రమ బదిలీలు, నియమాకాలు, అక్రమ ప్రాజెక్టుల ఆమోదం తదితర అంశాలపై ప్రభుత్వం చేపట్టిన విజిలెన్స్ దాడుల రిపోర్టును బహిర్గతం చేసి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పై సిబిఐ విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ విసిగా 2021 మే లో బాధ్యతలు చేపట్టిన తాటికొండ రమేష్ పదేళ్ల అనుభవం లేకున్నా పైరవీలతో విసిగా నియమింపబడ్డారన్నారు. అప్పటి రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తో కలిసి ప్రొఫెసర్ల ప్రమోషన్లలో అక్రమాలకు పాల్పడ్డారని అనేక విమర్శలు వచ్చాయన్నారు. రూల్స్‌కు విరుద్ధంగా 16 మంది అర్జెంట్ ఫ్యాకల్టీలకు సుమారు నెలకు రూ. 8లక్షలు చెల్లించారని, ఎలాంటి క్లాసులు బోధించని ప్రొఫెసర్లకు సుమారు రూ. 98 లక్షలు చెల్లించారని రామకృష్ణ విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ భూములు ప్రైవేటు వ్యక్తులు అక్రమిస్తున్నా చూసి చూడనట్లుగా వ్యవహరించారన్నారు. ఫెక్ ప్రాజెక్టుల పేరిట డబ్బుల వసూళ్లు, ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల ఫీజుల రూపంలో యూనివర్సిటీకి రావాల్సిన సుమారు రూ. 5కోట్లు స్వాహా చేసిన వారితో విసి కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపించాయన్నారు. నాక్ బృందం యూనివర్సిటీ సందర్శన సమయంలో తప్పుడు సమాచారం ఇవ్వడం, అర్హులైన ప్రొఫెసర్లకు పదోన్నతులు ఇవ్వకుండా అనర్హులకు పదోన్నతులు ఇవ్వడం ఆయనకు అనుకూలమైన వ్యక్తికి మూడు విభాగాలలో ఇంచార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటన్నింటిపై విజిలెన్స్ దాడులతో పాటు సిబిఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న విసి తాటికొండ రమేష్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, చందులాల్, నవీన్, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం నేతను పరామర్శించిన పోటు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకులు కొప్పోజు సూర్యనారాయణను సోమవారం సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, సీనియర్ నాయకులు అడపా రామకోటయ్య పరామర్శించారు. ఖమ్మంలోని శ్రీరాం హీల్స్‌లో కుమారుని ఇంటి వద్ద ఉన్న సూర్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనను పరామర్శించిన వారిలో సూర్యాపేట జిల్లా రైతు సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## క్లాసిక్ జిమ్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వర్కౌట్స్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఇల్లందు క్రాస్ రోడ్డు (సర్దార్ పటేల్ స్టేడియం) లో గల క్లాసిక్ జిమ్‌లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం వర్కౌట్స్ చేశారు. ఖమ్మంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పర్యటనలో పాల్గొనేందుకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారు జామున ప్రవీణ్ కుమార్ క్లాసిక్ జిమ్‌కు వచ్చారు. జిమ్ చేస్తున్న వారితో సరదాగా ముచ్చటించారు. జిమ్ వాతావరణం బాగుందని అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇటువంటి సౌకర్యాలు కల్పించిన జిమ్ నిర్వాహకులు మనోజ్‌కుమార్, నగీనాలకు అభినందనలు తెలిపారు.

# విజ్ఞాన యాత్రకు వెళ్లిన డిసిసిబి పాలక వర్గం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలక వర్గం విజ్ఞాన యాత్రలో భాగంగా కేరళ రాష్ట్రానికి వెళ్లారు. నాబార్డ్ సహకారంతో టిఎస్ కాబ్ సిటిఐ వారి ఆధ్వర్యంలో డిసిసిబి ఖమ్మం పాలక వర్గ సభ్యులు కేరళ రాష్ట్రంలోని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకుకు అనుబంధంగా పనిచేస్తున్న ప్రాథమిక సహకార సంఘాలను, బ్రాంచీలను సందర్శించుటకు ఈ నెల 23 వరకు అక్కడ పర్యటించనున్నారు. డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాలక వర్గ సభ్యులు పర్యటనలో భాగంగా సోమవారం కేరళ బ్యాంకులకు అనుబంధంగా ఉన్న మున్నారు కో ఆపరేటివ్ బ్యాంకును సందర్శించారు. ఈ సందర్భంగా ఆ బ్యాంకులో అవలంభిస్తున్న హెచ్ఆర్ పాలసీలు, వివిధ రకాల రుణ పథకాలు, డిపాజిట్ స్కీమ్స్, ఇతర సర్వీసుల గురించి తెలుసుకున్నారు. కేరళ రాష్ట్రంలో ఇప్పటికి అమలులో ఉన్న రెండంచెల విధానం రాష్ట్ర అపెక్స్ బ్యాంక్, ప్రాథమిక సహకార సంఘాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ దొండపాటి మాట్లాడుతూ కేరళ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు అవలంభిస్తున్న విధి విధానాలు రైతులకు ఉపయోగపడేవిధంగా ఉన్నాయన్నారు. 22 వరకు కేరళలో పర్యటించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, కృష్ణయ్య, చావా వేణు, మేకల మల్లిబాబు యాదవ్, నిర్మల, పుల్లారావు, బోబోలు లక్ష్మణ్‌రావు, జనగం కోటేశ్వరరావు, పేరబత్తిని ప్రసాద్, నూకల సైదులు, కోరం జానకిరావు, మోదుగు పుల్లారావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ డిజిఎం కిరణ్, ఏజిఎం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగుల కేంద్రానికి నిత్యావసరాల అందజేత




**ప్రజాపక్షం/ బోనకల్ :** సినీ నటులు జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు సందర్భంగా మండల కేంద్రమైన బోనకల్‌లో గల శాంతి నిలయం మానసిక వికలాంగుల ఆశ్రమానికి నిత్యావసర వస్తువులను అందజేశారు. చింతకాని మండలం తిరుమలాపురం ఎన్‌టిఆర్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమానికి నెల రోజులు సరిపడ నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల సమక్షంలో కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఆశ్రమ నిర్వహకులను యూత్ సభ్యులు ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేపలమడుగు వీరబాబు, ఐతం జోసెఫ్, రావుట్ల ఉపేంద్రచారి, ఐతం కిషోర్, గోగుల భార్గవ్, మడుపల్లి పెంటయ్య, గోగుల నర్సింహారావు, కళ్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మందడపు నాగేశ్వరరావు వర్ధంతిని జయప్రదం చేయండి

**- హాజరుకానున్న కూనంనేని**




**ప్రజాపక్షం/ మధిర :** ఈ నెల 21న అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు మూడవ వర్ధంతిని జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మందడపు నాగేశ్వరరావు చదువుకునే రోజుల్లో విద్యార్థి నాయకుడిగా ఉద్యమాల ద్వారా రాజకీయ చైతన్యం పొంది సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుగా, జిల్లా కార్యవర్గ సభ్యులుగా, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మల్లారం ఎంపిటిసిగా అంచెలంచెలుగా ఎదిగి ప్రజలకు ఎనలేని సేవలు చేశారని, అలాంటి మహోన్నత వ్యక్తి కరోనాతో మృతి చెందటం చాలా బాధాకరమన్నారు. తాను నమ్మిన సిద్దాంతం కోసం 40 సంవత్సరాలు పాటు ఎర్రజెండాయ్యే శ్వాసగా జీవించడాని, తన తండ్రి రామయ్య పోరాట వారసత్వాన్ని కొనసాగించాడన్నారు. మండల పరిధిలోని మల్లారం గ్రామంలో మంగళవారం సాయంత్రం 5గంటలకు జరిగే మందడపు నాగేశ్వరరావు మూడో వర్ధంతి కార్యక్రమానికి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితిసభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అనుబంధ సంఘాల నాయకులు ఈ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడ్మిషన్ల బ్రోచర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూత నంగా సైన్స్ సెక్షన్స్ మంజూరైన సంద ర్భంగా అడ్మిషన్ల ప్రచారం కోసం కళాశాల నందు సోమవారం బ్రోచర్లను ఆవిష్కరించారు. ఎవిల్‌యు ఎంఎస్ఐ అధ్యక్షులు అశోక్ బాబు రూ.5వేల వితరణ తో బ్రోచర్లను తయారు చేయగా వాటిని పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కళాశాలకు రంగులు వేటయం, సైన్స్ సెక్షన్‌కు బోధనా సిబ్బందిని కేటాయించటం, నూతన భవన నిర్మాణం, ల్యాబ్‌ల నిర్మాణం కోసం తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.బాలస్వామి, సిహెచ్ రాము, కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమానందరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బిజెపి ప్రచారం



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమానందరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో మధిర పట్టణంలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు, మధిర అసెంబ్లీ కన్వీన్ ఏలూరి ఆధ్వర్యంలో మధిర కోర్టు న్యాయవాదులను, బ్యాంక్ ఉద్యోగులను, ఎల్ఐసి, పోస్టల్ ఉద్యోగులను, విద్యాసంస్థల ప్రతినిధులను, పట్టభద్రులను కలుసుకుని బిజెపి అభ్యర్థి ప్రేమానందరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళపల్లి విజయరాజు, బిజెపి జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుల పాపట్ల రమేస్, గుండా చంద్రశేఖర్, నూతక్కి నర్సింహారావు, దేవరకొండ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పరుగుపందెంలో బంగారు పతకం



**ప్రజాపక్షం/ చింతకాని :** ఢిల్లీలో ఫిట్ ఇండియా ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పరుగు పందెంలో చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టిపోగు సింహాద్రి అనే యువకుడు బంగారు పతకాన్ని సాధించాడు. వరంగల్‌లోని అగ్నివీర్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ శిక్షణ పొందుతున్న సింహాద్రి ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పురుగు పందెం పోటీల్లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన యువకులతో పోటీపడి 1600మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. జాతీయ స్థాయి పరుగు పందెంలో మొదటిస్థానంలో నిలిచిన సింహాద్రి జూన్ 20వ తేదీ నుండి అంతర్జాతీయ స్థాయిలో జరిగే పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యాడు. నాగులవంచ గ్రామానికి చెందిన చెట్టిపోగు వీరబాబు, దేవమణి దంపతుల కుమారుడైన సింహాద్రి పదవ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలో చదివాడు. సింహాద్రిని మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

# రాయల శేషగిరిరావుకు నివాళులర్పించిన మాజీ మంత్రి కేటీఆర్



ప్రజాపక్షం/ తల్లాడ ః తల్లాడ మండలం మిట్టపల్లిలో ఇటీవల మృతి చెందిన డిసిఎంఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరి రావు కుటుంబాన్ని మాజీ మంత్రి కేటిఆర్, రాజ్యసభ ఎంపి వద్దిరాజు రవి చంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రేగా కాంతారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేష్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం మిట్టపల్లిలోని ఆయన స్వగృహం నందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ రైతు బిడ్డ అయిన రాయల శేషగిరిరావు సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి ఉండి కేసీఆర్‌తో సాన్నిత్యం కలిగి నాయకుడు అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరమన్నారు. హైద్రాబాలో కొన్ని అనివార్యకారణాల వల్ల వారి కుటుంబాన్ని పరామర్శించలేకపోయానని, ఈరోజు రాయల శేషగిరిరావు కుటుంబాన్ని పరామర్శించి ఆయనతో ఉన్న సాన్నిత్యాన్ని నెమర వేసుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూకారాలని, వారి కుటుంబానికి భగవంతులు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరు కుంటున్నానని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం, రైతుల కోసం, సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడ్డ రాయల శేషగిరిరావు ఆశయాన్ని బిఆర్ఎస్ పార్టీ ముందుకు తీసుకుపోతుందని తెలిపారు.

# శరవేగంగా పవర్ ప్లాంట్ పనులు



ప్రజాపక్షం/ అశ్వారావుపేట రూ.30కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 25 మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని పామాయిల్ ఫ్యాక్టరీ ద్వారా వచ్చే వ్యర్థాలతో విద్యుత్‌ను పొందేందుకు ఆయిల్ ప్యాడ్ ద్వారా ఈ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టారు. దీని ద్వారా 25 మెగావాట్ల విద్యుత్ సరఫరా అవుతుంది. బయట నుండి వచ్చే విద్యుత్ నుండి కొన్ని ఇబ్బందులు తగ్గుతాయి. నిత్యం 24గంటల విద్యుత్ సరాఫరా నిరంతరంగా వస్తుంది. దీని వలన ఫ్యాక్టరీ ఎప్పుడు రన్నింగ్‌లో ఉంటుంది. ఆయిలఫామ్ పంటలకు కేంద్ర బిందువుగా ఉన్న అశ్వారావుపేట మండలంలో పవర్‌ప్లాంట్‌తో పామాయిల్ ఫ్యాక్టరీకి విద్యుత్ సమస్య తీరనుంది. ఫ్యాక్టరీ సామార్ధ్యానికి కాకుండా ట్రాన్స్‌కోకు మిగులు విద్యుత్‌ను ఇచ్చేందుకు అనువైన రీతిలో సాంకేతిక పరమైన అన్ని హంగులతో పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. ఉద్యానవన పంటకు అనువైన ఈ ప్రాంతం విద్యుత్ తయారు కేంద్రాలకు అనువైన ప్రాంతంగా విరాజిల్లుతోంది. గతంలో బయట నుండి వచ్చే విద్యుత్ వలన కొన్ని ఇబ్బందులు ఫ్యాక్టరీ ఎదుర్కొనేది. కాని ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తయితే ఫ్యాక్టరీకి విద్యుత్ పుష్కలంగా ఉంటుంది. దీనివలన పామాయిల్ ప్రూట్ నిల్వలు లేకుండా నిరంతరంగా రన్నింగ్‌లో ఉంటుందని పామాయిల్ సాగురైతులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి




ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ ః సమాజంలోని పేదలకు నేషనల్ లీగల్ సర్వీస్‌సెల్ అథారిటీ ప్రవేశపెట్టిన ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిస్టిక్ లీగల్ సెల్ అథారిటీ చీఫ్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని పెద్దతండాలో డిస్టిక్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు...దారిద్రరేఖకు దిగువానున్న ప్రజలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ప్రజానీకానికి నేషనల్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో అనార్గనైజెడ్ వర్కర్స్ స్కీమ్2015 ద్వారా ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నారని అన్నారు. ఆర్థికంగా వెనకబడిన బీసీలు, మైనారిటీలు, ఓసీలకు సంవత్సరానికి మూడు లక్షలకు తక్కువగా ఆదాయం ఉన్న వారందరూ ఈ ఉచిత న్యాయ సేవలు పొందటానికి అవకాశం ఉందన్నారు. చాలామంది కార్మికులు రూపాయి,రూపాయి సంపాదించుకొని ఆ సంపాదన మొత్తాన్ని ఆస్పత్రి ఖర్చుల కొరకు ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు ప్రభుత్వాలు కలిగిస్తున్న అవగాహనలను తెలుసుకుని లాభం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ లీగల్ సెల్ అథారిటీ అసిస్టెంట్ రవి, ఎసడబ్ల్యుసి వర్కర్స్ ముఠామేస్త్రులు వై. ఉపేందర్, కుమార్, ఆటో యూనియన్ నాయకులు రావుల శ్రీనివాసరావు, మేళ్లచెర్వు గురవయ్య, యూత్ లీడర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధును తక్షణమే జిల్లా అధ్యక్ష పదవి నుండి తొలగించాలి



ప్రజాపక్షం/కారేపల్లిః బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న తాతా మధు సొంత పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తూ పరోక్షంగా అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని, తక్షణమే అతనిని జిల్లా అధ్యక్ష పదవి నుండి తొలగించాలని కారేపల్లిలో సోమవారం పార్టీ కార్యకర్తలు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్ ఓడిపోవాలని నిశ్చయించుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేసిన నాయకులకు పార్టీ అధ్యక్షుడు తాతా మధు వెన్నుదన్నుగా ఉండి పార్టీకు నమ్మిన బంటులా ఉన్న మదన్‌లాల్‌పై నేడు అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని, బిఆర్ఎస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల ముందు రోజు కూడా గ్రామశాఖ అధ్యక్షులకు ఫోన్ చేసి పార్టీకి వ్యతిరేకంగా ఓట్లు వేయించాలని కోరిన ముఠా నాయకులకు మద్దతుగా ఉండి ఇప్పటికే పార్టీను బలహీనపరిచే చర్యలు చేపట్టారని అన్నారు. పార్టీపై ప్రేమ ఉన్న వారైతే గడిచిన అయిదేళ్లలో ఎన్నిసార్లు కెసిఆర్ చేసిన గొప్ప పనుల గురించి ఖమ్మం ప్రజలకు వివరించారు. అనేది తాతా మధు నిరూపించుకోవాలని అన్నారు. పార్టీ జెండాలు మోస్తూ జై కెసిఆర్ అనే నినాదాలతో కెసిఆర్ ఎజెండాయే మన ఏజెండాగా పనిచేయాలని కార్యకర్తలకు సూచిస్తూ ఎల్లవేళలా పార్టీ నిర్మాణం కోసం పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తాతా మధు వర్గీయులుగా ఉన్నా పార్టీ ద్రోహులు ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు. ఇప్పుడు మదన్‌లాల్‌పై బురదజల్లుతున్న నాయకులు ఎవరు కూడా గ్రామాల్లో పార్టీ కోసం గాని పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయలేదని, కేవలం ఎన్నికల ముందు చ్చి పార్టీపై కపట ప్రేమ కనబరిచి డబ్బుల కోసమే వచ్చారని అన్నారు. రాబోయే రోజుల్లో మీమీ గ్రామాల్లో మీకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సక్రు, మాజీ దిశా కమిటీ మెంబర్ లకావత్ లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ మూతి కోటేశ్వరరావు, టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు గుగులోతు జంకిలాల్, భూక్యా కోటేశ్వరరావు, ధరావత్ వికాస్, భూక్యా మధు, గంగరబోయిన మురళి పాల్గొన్నారు.

# ఉపాధి పనులపై కొనసాగుతున్న సోషల్ ఆడిట్





ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో జరిగినటువంటి పనులపై సోషల్ ఆడిట్‌ను నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో హడావుడిగా ఎవరికి పూర్తి స్థాయిలో సమాచారం లేకుండా సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సారి ఎన్నికలు అయిపోయిన తర్వాత రావడం వలన ఆడిట్ చేసేటటువంటి అధికారులు ప్రజలతో మమేకమై ప్రజల వద్దకు వెళ్లి ఎన్ఆర్ఈజీఎస్‌లో చేసిటువంటి పనులను క్షణ్ణంగా పరిశీలిస్తూ ఆడిట్‌ను కొనసాగిస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేసినటువంటి పనులపై ఎటువంటి సందేహాలు ఉన్న ఫిర్యాదులు ఉన్న చెప్పవలసిందిగా అధికారులు కూలీల వద్దకు వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. కొత్తగా ఉపాధి హామీ జాబ్ కార్డును పొందగోరేటువంటి వ్యక్తులు వెంటనే దరఖాస్తు చేసుకొని జాబు కార్డులను పొందవలసిందిగా తెలియజేస్తున్నారు. ఉపాధి హామీ పనుల తీరుపై ఎన్నో అవకతవకలు జరిగాయని వీటన్నిటిని అధికారులు దృష్టికి తీసుకువెళ్తామని కూలీలు తెలియజేస్తున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేసినటువంటి పనుల విషయంలో ఎటువంటి అక్రమాలకు అయిన పాల్పడినట్లు నిరూపణ అయితే వాటిని వెంటనే రికవరీ చేస్తామని అధికారులు తెలియజేస్తున్నారు.

# కాలువలను శుభ్రం చేయండి

**నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ ః వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలువలన్ని శుభ్రం చేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. ఎక్కడెక్కడ కాలువలు పూడుకుపోయాయో జాబితాను సిద్ధం చేసి తమకు అందజేయాలని తెలిపారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో శానిటరి ఇన్స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌తో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శానిటరి ఇన్స్పెక్టర్ వారి డివిజన్లలో ఎక్కడైతే వాటర్ ఆగుతున్నాయో జాబితాను సిద్ధం చేయాలన్నారు. కాలువలో చెత్త ఎక్కువగా పేరుకుపోయి వాటర్ ఆగుతుందా అనేది గుర్తించి అక్కడ గ్యాంగ్ వర్క్ పెట్టి క్లిన్ చేసే ప్రదేశాలు, మిషనరీతో క్లిన్ చేసే ప్రదేశాలు ఏమిటనేది గుర్తించాలన్నారు. డివిజన్లలో పూడుకుపోయినటువంటి ప్రధాన కాలువలన్నింటిని గ్యాంగ్ వర్క్ పెట్టి శుభ్రపర్చాలన్నారు. కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి వారికి జరిమానా విధించాలన్నారు. రోడ్డు పక్కన పెట్టే కొబ్బరిబొండాలు, ముంజకాయల వాళ్లు కాలువల్లో చెత్త వేసిన యెడల భారీగా జరిమానా విధించాలన్నారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో ముందస్తుగానే గ్యాంబూజా ఫిష్‌ని, ఆయిల్ బాల్స్‌ను సమకూర్చాలని తెలిపారు.

# పెనుబల్లి సబ్ స్టేషన్‌లో మంటలు



ప్రజాపక్షం/ కల్లూరు ః పెనుబల్లి మండల పరిధిలోని టేకులపల్లి 220 కెవి విద్యుత్ ఉప కేంద్రంలో సాంకేతిక సమస్యల కారణంగా మంటలు తలెత్తాయి. దీనితో కల్లూరు, పెనుబల్లి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కల్లూరుకు కొద్ది గంటల తర్వాత తల్లాడ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్దరించగా పెనుబల్లి మండలంకు మాత్రం చాలా సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

# కురముల ఆరాధ్య దైవం కామారతి బీరప్పల కళ్యాణం



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి ః అన్నపురెడ్డిపల్లి మండలంలో పెంట్లం గ్రామంలో ఉన్నటువంటి కురుముల ఆరాధ్యదైవం బీరప్ప కామారతి కళ్యాణాన్ని సోమవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశ్వారావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ హాజరయ్యారు. కురుమ సంఘం సభ్యులు గ్రామప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని పెంట్లం గ్రామంలో గల బీరప్ప దేవాలయంలో గత మూడు రోజులు నుండి బీరప్ప జాతరను కురుమలు ఎంతో ఘనంగా మేళతాళాలతో డిల్లెం బల్లెం అంటూ బీరడోళ్ళుతో పెద్ద బాకలతో ఒగ్గు కళాకారులు కథలతో ఎంతో ఘనంగా కార్యక్రమాన్ని చేశారు. శనివారం మైలపట్నం కార్యక్రమం ఆదివారం గ్రామంలో గల చెరువులో లింగాలు వెలికి తీయడం సాయంత్రం లింగాలు ఊరేగింపు కార్యక్రమం చేయడం సోమవారం ఉదయం గ్రామంలో గల ఆడబిడ్డలు బోనాలు ఎత్తుకొని దేవాలయానికి వెళ్ళడం అనంతరం మధ్యాహ్నం బీరప్ప, కామారతి కళ్యాణం చేయడం జరిగింది. ఒగ్గు కళాకారులు గజ్జ కట్టి డప్పులు కొట్టడం వారి ఆటపాటలతో పంచెకట్టు వేషధారణలతో భక్తులను ఎంతో అలరించారు. అన్నపురెడ్డిపల్లి శివాలయం పునర్నిర్మాణ వ్యవస్థాపకులు, హరిహర ఫౌండేషన్ అధ్యక్షులు మారగాని శ్రీనివాసరావు బీరప్ప, కామరతి అమ్మవార్లకు పట్టువస్త్రాలు బహురించారు. అదే విధంగా రూ 25వేలను విరాళంగా ఇచ్చి భక్తిని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో పరసా వెంకటేశ్వర్లు, రాము, వెంకటేశ్వరరావు, మాయర కృష్ణయ్య, నాగేశ్వరరావు, రామకృష్ణ, మల్లేష్, శ్రీను గ్రామంలో ఉన్నటువంటి మహిళలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపయోగంగా అంగన్వాడీ కేంద్రం




ప్రజాపక్షం/బూర్గంపాడు: నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామ పరిధిలోని గొమ్మూరు మినీ అంగన్వాడీ కేంద్రం నిరుపయోగంగా మారింది. ఇక్కడ కేటాయించిన గొమ్మూరు మినీ అంగన్వాడీ కేంద్రానికి, పక్కనే పల్లె దవాఖాన ఉండటంతో సరైన సెక్యూరిటీ లేకపోవడంతో గత పాలకవర్గం అధికారుల అనుమతితో గొమ్మూరు కాలనీలోని ఐటిడిఏ స్కూల్ నందు అంగన్వాడీ కేంద్రాని ఖాళీగా ఉన్న భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి ఈ మినీ అంగన్వాడీ కేంద్రం నిరుపయోగంగా మారింది. ఈ అంగన్వాడీ కేంద్రం భవనం, పల్లె దవాఖాన వేరువేరుగా ప్రహరీ నిర్మాణం చేపట్టి ఉపయోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ అంగన్వాడీ కేంద్రాన్ని ఉపయోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు....

**రిపేర్ చేయిస్తాం : సిడిపివో ప్రమీల**

మినీ అంగన్వాడీ కేంద్రాన్ని మరమ్మత్తులు చేయడం కోసం ఐటిసికి ప్రతిపాదన పంపించడం జరిగిందని సిడిపివో ప్రమీల ప్రజాపక్షంకు తెలిపారు. త్వరలో మినీ అంగన్వాడీ కేంద్రం మరమ్మత్తులు నిర్వహించిన అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తెరవడం జరుగుతుందన్నారు.

# వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



ప్రజాపక్షం/ములకలపల్లి:ముత్యాలంపాడు , జగన్నాధపురం నడుమ నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గంగారం ఎంపిటిసి మడకం విజయ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె స్ధానిక నాయకులతో కలిసి వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. వంతెన నిర్మానం నత్తనడకన సాగుతుందని, వర్షాకాలం సమీపిస్తున్న ఇంకా పిల్లర్స్ కూడా భూమి నుంచి పైకి రాలేదని, ఇట్లయితే వానాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తప్పవన్నారు. వంతెన నిర్మాణ పనుల్లో వాడుతున్న ఇసుక నాణ్యంగా లేదని, నిబంధనలు ప్రకారం గోదావరి ఇసుక వాడాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా నాణ్యత లేని వాగులోని ఇసుకను వాడుతున్నారని ఆరోపించారు. ఈ విధంగా కడితే వంతెన ఎంతకాలం మన్నుతుందని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు పనులు దగ్గర ఉండి నాణ్యంగా చేయించాలని కోరారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మడకం నరసింహారావు, మడకం రవి, విలేకరి ఈసం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వేలం పాట ఎప్పుడు...?

**కూసుమంచి స్టేషన్‌లో పార్కింగ్ ఇబ్బందులు**



ప్రజాపక్షం/ కూసుమంచి ః కూసుమంచి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సిబ్బంది పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన షెడ్డులో కార్లు పెడుతుండడం తో మోటార్ సైకిళ్లు బయట పార్క్ చేయాల్సి వస్తుంది. ఇంటి వద్ద ఉండాల్సిన కార్లు పోలీస్ స్టేషన్‌లో ఉంటున్నాయన్న ఆరోపణ వినపడుతుంది. ఇదిలా ఉండగా వివిధ కేసుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌లో ఉన్న వాహనాలు తుక్కు పట్టిపోతున్నాయి. ఏళ్ల తరబడి వాహనాలను స్టేషన్‌లోనే ఉంచడంతో పార్కింగ్‌కు ఇబ్బంది ఏర్పడుతుంది. వీటిని తొలగిస్తే పార్కింగ్‌కు అవకాశం కలగడంతో పాటు వచ్చిపోయే ప్రజల వాహనాలను పార్కు చేసుకోవడానికి కూడా ఉపయోగపడే అవకాశం ఉంది. ఒకరిద్దరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో వేసిన షెడ్డును ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో షెడ్డును అందరికి ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవడంతో వివిధ కేసుల నిమిత్తం వచ్చిన వాహనాలను వేలం పాట ద్వారా తొలగించి పార్కింగ్ సౌకర్యం మెరుగుపరిచేలా చూడాలని కోరుతున్నారు.

# ఎమ్మెల్యే పర్యటన



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రఘునాథ్ బంజరు గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఖమ్మంపాటి లక్ష్మణరావు టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఆయన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే మట్టా రాగమయి సమక్షంలో చేరారు. అదే విధంగా బొడ్డు పుల్లయ్య గృహంలో వివాహ కార్యక్రమం, నూతన దుకాణం ప్రారంభం, అను శ్రీ పుట్టినరోజు కార్యక్రమం పలు శుభకార్యాలలో పాల్గొని పలకరింపులతో పాటు దుకాణాలు ప్రారంభించడం కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్ రావు, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు రెండు పశువులు మృతి



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండలం పెద్ద కోరుకొండిలోని మామిడి తోటలో పిడుగు పడి రెండు పశువులు మృతి చెందాయి. బాధితుల వివరాలు ప్రకారం.. పెద్ద కోరుకొండి గ్రామానికి చెందిన వినుకొండ దానియల్ కి చెందిన దుక్కిటేద్దు రావికంపాడు గ్రామానికి చెందిన వల్లభనేని సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఆవు ఆదివారం మేతకు వెళ్లాయి. అకాల వర్షం లో పడిన పిడుగుపాటుకు రెండు పశువులు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. ఎంతకు మేతకు వెళ్ళిన పశువులు ఇంటికి రావట్లేదని వేదకులాట ప్రారంభించిన యజమానులు భవాని నారాయణ మామిడి తోటలో మృతి చెందినట్లు కనపడ్డాయి. దీంతో ఆ రైతులు లబోదిబో మంటూ అధికారులకు బంధువులకు గ్రామస్తులకు తెలియపరిచారు. ఈ విషయమై పశు వైద్య అధికారులకు సమాచారం అందించారు. వారు పోస్టుమార్టం నిర్వహించి నష్టాన్ని అంచనా వేశారు. దుక్కిటేద్దు విలువ రూ. 90,000, రూ. 80,000 ఉంటుందని అంచనా వేశారు. రైతులు పిడుగుపాటుకు మరణించిన పశువులు నష్టం పట్ల ఎక్ష్ గ్రేషియా అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# హరితహారానికి నర్సరీలు సిద్ధం



ప్రజాపక్షం/కల్లూరుః వానాకాలంలో చేపట్టే హరితహారం కు 31 నర్సరీలను హరితారానికి సిద్ధం చేసినట్లు ఎంపీడీవో చంద్ర శేఖర్, ఏపీవో హేమమాలిని లు తెలిపారు. ఒక్కో నర్సరీ లక్ష రూపా యలు నిధులతో 31 లక్షల ఉపా ధి హామీ నిధుల ద్వారా నర్సరీలను పెంచి గ్రామపంచాయతీలలో, అంగన్‌వాడి పాఠశాలలు, అంతర్గత రోడ్లు ఇరువైపుల, ఆర్ అండ్ బి మరియు ప్రభుత్వ స్థలాలలో పెంచేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో నర్సరీలో 10,000 మొక్కల పైగా పెంచుతున్నట్లు పేర్కొన్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించడం జరిగిందని నర్సరీలు పెంచే బాధ్యత కార్యదర్శుల ఆధ్వర్యంలో నడుస్తుందని నీడ , పూలు, పండ్లునిచ్చే, ఎర్ర తురాయి, వేప,గంగ రాయి, మరియు గులాబీ ,మల్లె, గన్నేరు, జామ, ఉసిరి, నిమ్మ, మామిడి, దానిమ్మ, బొప్పాయి, బాదం, అల్లనేరేడు, ఆకాశమల్లి, రావి ,సీతాఫలం, వేప, ఖర్జూరం, చామంతి, మందారం, తదితర మొక్కలను పెంచినట్లు నాటేందుకు సిద్ధమైనట్లు ఎంపీడీవో, ఏపీవోలు తెలిపారు. జూన్ లో హరితహారానికి నర్సరీలను సిద్ధం చేసినట్లు వర్షాలు పూర్తిస్థాయిలో రాగానే నాటే ప్రక్రియ చేస్తామనివారు అన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు , టెక్నికల్ అసిస్టెంట్లు,మేట్ లు స్థానిక ఉద్యోగులు తో సమీక్ష సమావేశం నిర్వహించి సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో, ఏపీవో లు తెలిపారు.

# నూతన కూల్ డ్రింక్ షాప్ ప్రారంభం



ప్రజాపక్షం/కరకగూడెంః మండల కేంద్రమైన కరకగూడెంలో కొమరం రాంబాబు నూతన కూల్ డ్రింక్ షాప్ ను సోమవారం మాజీ సర్పంచ్ ఊకె రామనాథం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య, బుడగం రాము, గోగ్గల నరసయ్య, బైరిశెట్టి రామారావు, రావుల రవి, చిట్టీమల్ల ప్రవీణ్, మాజీ సర్పంచ్‌లు పాయం నరసింహారావు, పోలేబోయిన నరసింహారావు, కొమరం విశ్వనాథం, అరేం సాంబ, బిక్షపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నను ఎంఎల్‌సిగా గెలిపించండి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** సిపిఐ, సిపిఎం పార్టీలు బలపర్చిన ఖమ్మం నల్గొండ వరంగల్ శాసన మండలి పట్టభద్రుల అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో సిపిఐ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడు తూప్రజల పక్షాన ప్రశ్నించే వారు ఈ సమాజానికి అవసరమని అటు వంటి వ్యక్తులను గెలిపిస్తే మేలు జరుగుతుందన్నారు. తీన్మార్ మల్లన్న జర్నలిస్టుగా విశేష సేవలు అందించారని ఆయనను గెలిపించాలని పట్ట భద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంపటి సురేందర్, వెన్నం భాస్కర్, వెంపటి రాము, మేళ్లచెరువు గురవయ్య, రవి, ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, ఆర్ . గోపి, తనగం భాస్కర్, పొన్నెగంటి అఖిల్, తేళ్లూరి రవి, కాంగ్రెస్‌నాయకులు ఖాదర్, చారి, కల్లెం కేసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దశ దినకర్మలకు హాజరైన కూనంనేని



**ప్రజాపక్షం/ఖమ్మం :** సుజాత నగర్ మండల పరిధిలోని నాయ కులగూడెం గ్రామానికి చెందిన సిపిఐ మండల నాయకులు కుమారి కృష్ణ మాతృమూర్తి కుమారి సుగుణమ్మ ఇటీవల మృతి చెందారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సోమవారం జరి గిన దశదినకర్మకు హాజరై వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడవద్దని, తమ కుటుంబానికి అండగా ఉంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రూ, సంయుక్త కార్య దర్శి కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, సహాయ కార్యదర్శి వేల్పుల భాస్కర్, సిపిఐ మండల నాయకులు దండు సురేష్, బొడ్డు కేశవరావు, వీర్ల మల్లేష్, దుర్గ ప్రసాద్, దొడ్డ వెంకన్న, కృష్ణ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# మూడోసారి కేంద్రంలో బిజెపిది అధికారం

### బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



**ప్రజాపక్షం/వైరా:** కేద్రంలో ప్రధాని మోడీ నాయకత్వంలో బిజెపిప్ర భుత్వం మూడోసారి అధికారం చేపట్టడం ఖాయమని బిజెపి జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు అన్నారు. వైరా నియోజక వర్గ కేంద్రంలో బిజెపి నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తలు సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారా యణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ తెలం గాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో అధికా రంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్న హామీ ఇచ్చిన పథకాలు నేటికి అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలకు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూముల అమ్మిన నిధులు సరిపోవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చీలికలు మొదలయ్యే ప్రమాదం ఉంది. ఆగస్టు నెలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చీలికలకు ప్రమాదం ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉన్న ముగ్గురు మంత్రులు వెన్నుపోటు పొడిచే ప్రమాదం ఉంది. కేంద్రంలో ప్రధాని మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టడం ఖాయం అని అన్నారు. మోడీ నాయకత్వంలో 70% మంది పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. గ్రాడ్యుయేట్ సమస్యల పరిష్కరించాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మిగిలిపోయిందని విమ ర్శించారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. జూన్4వ తేదీన ప్రకటించే ఎన్నికల ఫలితాల్లో 400 సీట్లు గెలుచుకోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు శ్యామ్ రాథోడ్, నెల్లూరు కోటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో తీన్మార్ మల్లన్న ప్రచారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న సోమవారం ఖమ్మం కోర్టులో ప్రచారం నిర్వహిం చారు. న్యాయవాదులను , న్యాయశాఖ ఉద్యోగులను కలిసి తనకు ఓటేయాలని అభ్యర్థించారు. జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని, న్యాయ వాద హక్కుల కోసం పోరాడతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. గుర్రాయి గూడెం గ్రామానికి చెందిన కాకా క్రిష్ణయ్య రైతుకు చెందిన సూడి ఆవు సోమవారం ఉదయం మేతకు వెళ్లి గ్రామం ప్రక్కనే గల చేనుల్లో మేత మేస్తుండగా, ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్కన మేత మేసే సమయంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌వైర్‌కు తగిలి అక్కడిక్కడే ఆవు మృతి చెందింది. తక్కువ ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల తన ఆవు ప్రమాదానికి గురై చనిపోయిందని రైతు క్రిష్ణయ్య వాపోయాడు. చనిపోయిన సూడి ఆవు విలువ రూ 70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. వ్యవసాయ పనులకు ఉపయోగపడే ఆవు చనిపోవడం వల్ల నేను వ్యవసాయం చేయలేనని తనను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

# అనుమతులు ఓ చోట.. విక్రయాలు మరోచోట




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** కొత్తగూడెం సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో జరుగు తున్న స్టాంపుల విక్రయాదారుల ఏజెంట్ల అనుమతి కొరకు అక్రమాల చిట్ట పెద్ద పుట్టలాగా పెరిగిపోయింది. కొత్తగూడెం సబ్ రిజిస్టర్ పరిధిలో స్టాంపుల విక్రయాలు చేయాలంటే ప్రభుత్వం ద్వారా అనుమతి తప్పని సరి. అయితే అనుమతులు తీసుకోవాలంటే సబ్ రిజిస్టర్ కొత్తగూడెం ఆఫీస్ నందు చేతివాటం చూపాల్సిందేనట! నాడు స్టాంపు విక్రయదారు లకు అనుమతులు సులువుగా ఉండే నేడు కూడా అదే పరిస్థితి ఉన్నప్ప టికీ పై స్థాయి నుండి క్రిందిస్థాయి అధికారులు దాక చేతివాటం ఉంటుందట. రూ.20వేలతో పూర్తి కావాల్సిన అనుమతి నేడు లక్ష కొట్టు అనుమతి పత్రం పట్టు అన్నట్టుగా నడుస్తుంది. ఒప్పందాలు ఆస్తులు లాంటివి మొదలుకొని చేర్పులు మార్పుల దాకా స్టాంపు పేపర్ల వాడకం బాగా పెరిగిపోయింది. అదే అదునుగా చూసుకొని అటు అది కారులు ఇటు విక్రయదారులు ప్రజల అవసరాలను తెలుసుకొని అడ్డగో లుగా అధిక ధరలకు బాండ్ పేపర్ల విక్రయాలను జరుపుతున్నారు. అనుమతి ఒకచోట అమ్మకాలు మరోచోట చేస్తున్నారు. జనాల రద్దీ ప్రాంతాల్లో బాండ్ల వాడకం ఎక్కువగా ఉంటుందని తెలుసుకొని ప్రాంతాల మార్పిడిని చేస్తున్నారు. ఇటువంటివి సాక్షాత్తు సబ్ రిజిస్టర్ కొత్తగూడెం కనుసైగల్లోనే జరగడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఎటువంటి అర్హతలు లేకున్నా స్టాంపుల క్రయవిక్రయాలు అంతా ఆఫీస్ ఎదుటే జరగడం అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించడం పట్ల ప్రజలుఆశ్చర్యానికి లోనవుతున్నారు. ఇప్పటికైనా పై స్థాయి అధికా రులు చొరవ తీసుకొని గాడి తప్పుతున్న బాండ్ల విక్రయాలను సక్రమా ర్గంలో నడపాలని పలువురు కోరుతున్నారు.

# బాధిత కుటుంబాలకు ఎంఎల్‌ఏ పరామర్శ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** బాధిత కుటుం బాలకు అండగా ఉంటామని అశ్వారావు పేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ అన్నా రు. సోమవారం మండలంలోని పలు బాధి త కుటుంబాలను ఆయన పరామర్శించారు. మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన అగ్నిప్ర మాదంలో ఇంటిని కోల్పోయిన ఎస్‌కె బడే సాబ్‌ను పరామర్శించి, ఆదుకుంటామని భరోసాను కల్పించారు. చంద్రుగొండకు చెం దిన సీనియర్ జర్నలిస్టు మునగాల కోటాచారి మాతృమూర్తి చనిపోవడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జర్నలిస్టుకు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట సీని యర్ నాయకులు అంకిరెడ్డి క్రిష్ణారెడ్డి, సారేపల్లి శేఖర్, సంకా సంకర్, ఇస్లావత్ రుక్మిణి, బగుగు క్రిష్ణవేణి, దారం గోవిందరెడ్డి, సయ్యద్ రసూల్ తదితరులు ఉన్నారు.

# బిఆర్క్ ఫలితాల్లో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులకు ర్యాంకుల పంట




**ప్రజాపక్షం/వైరా:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు నిర్వహించిన బిఆర్క్ ప్లానింగ్ 2024 ఫలితాల్లో న్యూలిటిల్ ఫ్లవర్ కళాశాల విద్యార్థులు జాతీ యస్థాయిలో ప్రతిభ కనబరిచి తమ ఆధిక్యాన్ని చాటుకున్నారని కర స్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు తెలిపారు. కుర్రా స్వాత్య1247, నందిగామ విక్రాంత 3350, చావా సాయి సుధీర్ 4095, వడ్డే శ్రీముఖి 10862 ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగాఏ ర్పాటు చేసిన కార్యక్రమాల్లో డాక్టర్ పి.భూమేష్ రావు మాట్లాడుతూ ఇంతటి ఘన విజయాన్ని సాధించడానికి ప్రణాళికాయుతమైన, పటిష్టమైన, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం ఈ ఘన విజ యానికి కారణమని మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజ యాన్ని సాధించామని మాట్లాడారు. ఈ విజయా నికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యా యులు, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# రోడ్డుపై గుంతలు..రాకపోకలకు అంతరాయం



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేని మండలం అప్పాగూడెం పంచాయతీ తులిస్యాతండా గ్రామంలో ఈటి వలన గత బిఆర్ఎస్ ప్రభు త్వంలో కారేపల్లి టు పేరుపల్లి రోడ్డు తులి స్యాతండా గ్రామం వద్ద రోడ్డు పగిలి గుంతలు ఏర్పడి రాకపోకలు ఇబ్బంది కలు గుతుంది. అది గ్రామస్థులు ఎస్ఎన్.నాయక్ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కి తెలియజేయగా వెంటనే స్పందించి జెసిబి పంపించి రోడ్డుకు మట్టి పోయించడం జరిగింది.

# సీనియర్ న్యాయవాది వరదాచారి మృతి

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** సీనియర్ న్యాయవాది ఎంవి వరదాచారి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. వరదాచారి ప్రభుత్వ న్యాయవాదిగా, పిపిగా పని చేశారు. వరదాచారి మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేరళ్ల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, ఐఎఎల్ నాయకులు ఓరుగంటి శేషగిరిరావు, చింతనిప్పు వెంకట్, తెల్లాకుల రమేష్ తదితరులు సంతాపం తెలిపారు.

# ఎమ్మెల్సీగా రాకేష్‌రెడ్డిని గెలిపిద్దాం




## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: సోమవారం కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్ నందు టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో టిఆర్ ఎస్ పార్టీ తరఫున పోటీలో ఉన్న ఏనుగుల రాకేష్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్దాలను ఆడుతున్నారన్నారు. రైతులను నిరుద్యోగులను మోసపూరిత వాగ్దానాలతో మోసం చేస్తున్నారన్నారు. 6 గ్యారంటీల మేనిఫెస్టోలో పొందుపరిచి వాటిని అమలు చేయలేక తలలు పట్టుకొని ఆలోచన లేని పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇస్తానని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి నేటి వరకు ఆ మాటలు నిలబెట్టుకోలేకపోయారన్నారు. పది సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ భారతదేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల కంటే తెలంగాణ రాష్ట్రంలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చిన ఘనతను సంపాదించుకుందన్నారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేస్తున్న వ్యక్తి బ్లాక్ మెయిలర్ అనేక కేసుల్లో నిందితుడిగా ఉండిజైలుశిక్ష అనుభవించిన ఘనుడని అన్నారు. గడిచిన 10 సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వంలోనే పాలనకు నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు చాలా వ్యత్యాసం ఉందని, రాష్ట్రంలోని మేధావి వర్గం రైతాంగం ఉద్యోగ సంఘాల నాయకులు చెప్పుకుంటున్నారన్నారు. పట్టభద్రులు ఈ నెల27న జరిగే ఉప ఎన్నికల్లో ఏనుగు రాకేష్‌రెడ్డి ఓటు వేసి ప్రజల పక్షాన నిలబడే గొంతుకను శాసనమండలిలో కూర్చోబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు రేగా కాంతారావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, వనమా విశ్వేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, దిండిగాల రాజేందర్, బానోతు హరిప్రియ, తాటి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం చైర్మన్ కాపు సీతామాలక్ష్మి, ఎంపిపిలు, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

## రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : లోక్‌సభ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఖమ్మం పార్లమెంటునియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నోడల్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఎంఎల్‌సి ఉప ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.లెక్కింపు విధుల సిబ్బందికి ఈనెల 29న మొదటి విడత, జూన్ రెండున రెండో విడత శిక్షణకు ఏర్పాట్లు చేయాలన్నారు. సూక్ష్మ పరిశీలకులు శిక్షణా కార్యక్రమాన్ని ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపుకు అవసరమయ్యే సామాగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద తహసీల్దార్లను బాధ్యులుగా పెట్టాలన్నారు. లెక్కింపు పిదప ఈవిఎం యంత్రాలను గోడౌన్ తరలింపుకు డిజిటి వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. లెక్కింపు కేంద్రం వద్ద వెబ్‌కాస్టింగ్, సిసి కెమెరాలనుఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ రూము ఫర్నీచర్, మీడియా సెంటర్ షామియానా, ఫర్నీచర్ ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ మధ్యాహ్నం 12.30లోపు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఈవిఎం క్యారీయింగ్ స్టాఫ్‌ను నియమించాలన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఎంఎల్‌సి ఉప ఎన్నికల నిమిత్తం 40 లోకేషన్లలో 115 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన చేయాలన్నారు. 40 లోకేషన్లలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. కావాల్సిన పోలింగ్ సిబ్బంది, సెక్టార్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ నియమాకం చేపట్టినట్లు, రూట్ మ్యాపులు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 21న మొదటి విడత, 26న రెండో విడత శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణలో జంబో బాక్స్, గోద్రెజ్ బాక్స్ సీలింగ్, ఫారాల పూరణపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుందన్నారు. అధికారులు నియమ నిబంధనలు పాటిస్తూ ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకుండా జీరో ఎర్రర్ తో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో అదనపుకలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, డిఆర్‌వో ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరాం, డిఎంఅండ్‌హెచ్‌వో మాలతి, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్ కుమార్, పిఆర్‌ఎస్‌ఈ చంద్రమౌళి, ఆర్డీవో ఆఫిన్ సిద్ధిఖి, పౌర సరఫరా జిల్లా మేనేజర్ శ్రీలత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుని అరెస్టు



ప్రజాపక్షం/తల్లాడ : మండల పరిధిలోని గోపాలపేట గ్రామంలో ఆస్తి కోసం కన్నతల్లిని, ఇద్దరు కుమార్తెలను హత్య చేసిన హంతకుడు వెంకటేశ్వర్లును పోలీసులు అరెస్టు చేసి న్యాయ స్థానం ఎదుట హాజరుపరిచారు. వెంకటేశ్వర్లుతో పాటు ఆయనను హత్యలకు ప్రేరేపించిన రెండో భార్య త్రివేణిని కూడా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఎన్నికల శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

### - ఎన్నికల అధికారి ప్రియాంక ఆలా

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఈ నెల 27న జరగనున్న పట్టభద్రులు ఎన్నికకు సంబంధించి నిర్వహించే శిక్షణ తరగతులను సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి డా.ప్రియాంకా ఆలా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశంలో ఆమె శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగుండాలన్నారు. 26న రామచంద్ర ఆర్ట్స్ కాలేజీలు ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేస్తామని, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు భిన్నంగా ఎంఎల్‌సి ఎన్నికలు ఉన్నందున ప్రథమ ప్రాధాన్యత ఓటు ద్వారా ఓటు వేయించాలని తెలిపారు. ఈఎన్నికలకుబ్యాలెంట్ పేపర్లు ఉంటాయని, వాటిని మడిచే విధంగా కూడా తెలిపాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెంట్ వినియోగించాలని, పట్టభద్రులంతా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ట్రైనింగ్ నోడల్ అధికారి అలీమ్, డిఎల్‌ఎంటి పూసాటి సాయికృష్ణ, కిరణ్ కుమార్, పిఓ, ఏపిఓతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని కాకతీయ పంచదార పరిశ్రమలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 25వ తేదీ వరకు రోజుకో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు రఘునాథ బాబు తెలిపారు. సుప్రభాత సేవ, ఆరాధన, సేవా కాలం, తీర్థ ప్రసాద గోష్టి , 22న అగ్ని ప్రతిష్టాపన, 23న చక్ర మండలారాధన, 24న గరుడ వాహనంపై ఊరేగింపు, 25న ప్రత్యేక పూజలతో ముగింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఆలయ కమిటీ వారు తెలిపారు. కావున ఈ యొక్క ప్రత్యేక పూజలులో భక్తులు పాల్గొని దేవుని యొక్క ఆశీర్వాదాలు పొందాలని కోరారు.

## ఇంటర్ గిరిజన గురుకులాల్లో 23న స్పాట్ కౌన్సెలింగ్

ప్రజాపక్షం/భద్రాచలం : గిరిజన గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 23న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు భద్రాలం గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవదాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి,బైపిసి, సిఇసి,హెచ్ఇసి, ఒకేషనల్ గ్రూపుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినీలు టిసి, కుల, ఆదాయ, విద్యార్హత ధృవీకరణ పత్రాలతో 23వ తేది ఉ.10 గం.హాజరు కావాలని సూచించారు. 202324 విద్యా సం.లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీలు మాత్రమే ఈ స్పాట్ కౌన్సిలింగ్‌కు అర్హులని తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



ప్రజాపక్షం/కల్లూరు: పెద్ద కోరుకొండి విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తులు దృశ్య పెద్ద కోరుకొండి, మిట్టపల్లి కేంద్రంలో పరిధిలో ఉన్న గ్రామాలతో పాటు కల్లూరు మండలం గ్రామాలైన పెద్ద కోరుకొండి, చెన్నూరు, రావికంపాడు, లింగాల, ఎర్రబోయినపల్లి, చిన్న కోరుకొండి , పోచవరం, తెలగవరం, మర్లపాడు, పాయపూర్ తదితర గ్రామాలలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ పెద్ద కోరుకొండి ఉపకేంద్రం అధికారి తిరుపతయ్య తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు అందరూ గమనించి సహకరించవలసిందిగా వారు ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యుత్‌షాక్‌తో గేదెలు మృతి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో వైరా రిజర్వాయర్ ఆనకట్ట సమీపంలో సోమవారం మేతకు వెళ్లిన గేదెలు విద్యుత్ స్తంభం వద్ద ఎర్త్ వైర్ తగిలి రెండు పాడి గేదెలను అక్కడే మృతి చెందాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలో ద్వారకానగర్‌కు చెందిన రాచబంటి పద్మ అనే రైతుకు చెందిన గేదెలుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది అక్కడికి వచ్చి విద్యుత్‌సరఫరా తీసివేశారు. గేదెలు విలువ సుమారు రూ.1.50లక్షలు నష్టం జరిగిందని తెలిపారు.

## ఘనంగా ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాపక్షం/కూసుమంచి : జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా కూసుమంచి మండల కేంద్రంలో సోమవారం ఎన్టీఆర్ అభిమానులు ఎన్టీఆర్ బర్త్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేశారు. కూసుమంచి మండల జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు అయితగాని నవీన్ ఉపాధ్యక్షుడు ఎండి.తాహిర్ హుస్సేన్ అలాగే అడపా శివ, సాయి, మధు, రాంబాబు, ఉపేందర్, వంశీ కూసుమంచి మండల ఎన్టీఆర్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో గిరిజన విద్యార్థులకు సీట్లు

ప్రజాపక్షం/భద్రాచలం : జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో గిరిజన విద్యార్థులకు 3,5,8 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 61 సీట్లు, 5వ తరగతిలో 30 సీట్లు, 8వ తరగతిలో 30 సీట్లు ఉన్నట్లు చెప్పారు. వచ్చేనెల 6వ తేదీ లోపు ఐటిడిఏలోని డిడి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, దరఖాస్తుతో పాటు కుల, ఆధాయ ధృవీకరణ పత్రాలు సమర్పించాలని, గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1 లక్ష 50 వేలు, పట్టణ ప్రాంతాల వారు రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు. జూన్ 12వ తేదీన భద్రాచలం ఐటిడిఏలో లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు.